సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 19 । నవంబర్ । 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న గోశాలలోని 20 కోడెలను వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మహబూబానాయక్‌కు చెందిన మంజునాథ గోశాలకు శనివారం అందజేశారు.



చిందు యక్షగానం

వేములవాడ: రాజన్న ఆలయ ఆవరణలో వైకుంఠం బృందం ఆధ్వర్యంలో శనివారం మైరావతి చిందు యక్షగానం నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
32.0/20.0

వాతావరణం

వాతావరణం తేటగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి. తెల్లవారుజామున మంచుపొగ కమ్మేసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్రమశిక్షణగా విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ అఖిల్‌మహాజన్



డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల్లో పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. వేములవాడటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం డివిజన్ పోలీసులు, సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. ఓటర్లు తమ ఓటుహక్కును ప్రజాస్వామ్య పద్ధతిలో వినియోగించుకునేలా పోలీస్ సిబ్బంది చొరవ తీసుకోవాలని సూచించారు.

కుష్టు నివారణే లక్ష్యం

- డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు



నోడల్ ఆఫీసర్స్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు కోరారు. సిరిసిల్లలోని కార్యాలయంలో శనివారం నోడల్ అధికారులకు జాతీయ లెప్రసీ నిర్మూలన కార్యక్రమం(ఎన్ఎల్ఈపీ)పై శిక్షణ ఇచ్చి మాట్లాడారు. కుష్టువ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల్లో కల్పించాల్సిన అవగాహనపై వివరించారు. అడిషనల్ డైరెక్టర్ రవీందర్‌నాయక్, వైద్యులు రజిత, శ్రీరాములు, శ్రీనివాస్, సురేష్, స్వామి, కాశీనాథం, బాలయ్య పాల్గొన్నారు.

ప్రపంచకప్ గెలవాలని గోల్డ్‌కప్ తయారీ



వరల్డ్‌కప్



సిరిగాధ సంతోష్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రపంచకప్‌ను టీమిండియా గెలవాలని కోరుతూ ఎల్లారెడ్డిపేటకు చెందిన స్వర్ణకారుడు సిరిగాధ సంతోష్ బంగారంతో వరల్డ్‌కప్ నమూనాను తయారు చేశాడు. 80 మిల్లీల బంగారంతో అర సెంటిమీటర్ ఎత్తుతో ప్రపంచకప్ నమూనాను తయారు చేసి సృజనాత్మకతను నిరూపించుకున్నాడు.

ట్యాక్స్ చెల్లించని మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం,ఆటో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గంభీరావుపేట పెద్దమ్మ స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద ట్యాక్స్ చెల్లించని మద్యంను శనివారం పట్టుకున్నారు. అనుమానాస్పద స్థితిలో వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా మద్యం పట్టుబడింది. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ట్యాక్స్ చెల్లించని రూ.3వేల విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం సరాఫరాకు వినియోగించిన ఆటోను సీజ్ చేశామని చెప్పారు. మహారాష్ట్ర నుంచి మద్యం తెచ్చిన ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన సావుల రాజన్న, పెద్దూరుకు చెందిన జంగిటి స్వామిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


జిల్లెల్లలో రూ.1.10 లక్షలు సీజ్



జిల్లెల్లలో నగదు సీజ్‌చేస్తున్న అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామ చెక్‌పోస్టులో శనివారం చేసిన తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.1.10లక్షల నగదును అధికారులు సీజ్ చేశారు. హైదరాబాద్ గోల్కొండకు చెందిన తార్పాటి రాజు తన కారులో సిరిసిల్ల వైపు వెళ్తుండగా కారును తనిఖీ చేసి ఎలాంటి ధ్రువీకరణపత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదు సీజ్ చేశారు.

నిద్రపోని నాయకులు!



నాయకా.. ఆరోగ్యం జాగ్రత్త

- రోజుకు 4 గంటలు కూడా నిద్రపోని లీడర్లు
- అజీర్తి, లోబీపీతో బాధపడుతున్న వైనం
- డీజేల హోరుతో ఇబ్బందులు తప్పవంటున్న డాక్టర్లు
- షుగర్, హృద్రోగులు అప్రమత్తంగా ఉండాలని సూచన
- పలుచోట్ల గాయపడుతున్న నాయకులు, కార్యకర్తలు

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ ప్రచారంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. డీ హైడ్రేషన్ కారణంగా ఆమె అస్వస్థతకు గురయ్యారు. సరైన విశ్రాంతి లేకపోవడం వల్లే ఇలా జరిగింది.

ఇటీవల పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడి ప్రచార ర్యాలీ జరిగింది. ఇందులో ఉత్సాహంగా పాల్గొన్న ఓ నాయకుడు ఉన్నట్టుండి గుండెపోటుతో కుప్పకూలాడు. వెంటనే అతన్ని కరీంనగర్ తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరిగింది. ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్దీ.. నాయకులు విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్నారు. దాదాపు అన్ని పార్టీల అభ్యర్థులు ఉదయం 5 గంటలకే నిద్రలేస్తున్నారు. కొందరు రాత్రి 12 గంటల నుంచి ఒంటిగంట వరక మేలుకొనే ఉంటున్నారు. సీనియర్ నాయకులు, మంత్రులకు తమ నియోజకవర్గంతోపాటు అదనపు నియోజకవర్గాల బాధ్యతలు, స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న వారికి ఇతర నియోజకవర్గాల ప్రచార డ్యూటీలు కూడా ఉండటంతో నిద్రకు దూరమవుతున్నారు. ఫలితంగా పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ ఇటీవల తాను పాల్గొన్న ఓ సభలో వాంతి చేసుకున్నారు. సరైన నిద్ర, విశ్రాంతి లేకపోవడం వల్లే ఇలా అయిందని ఆయన అనుచరులు పేర్కొన్నారు. బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రతీరోజు రాష్ట్రంలో ఏదో ఒకచోట ప్రచారం చేయాల్సి వస్తోంది. ఆయన కూడా ఇటీవల నిద్రలేక లోబీపీకి గురయ్యారు. వీరే కాదు.. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులందరికీ ఆరోగ్యపరంగా పలు సమస్యలు చుట్టుముట్టే అవకాశాలున్నాయి.

ఎవరికి ఎంత నిద్ర అవసరం?

అప్పుడే పుట్టిన బిడ్డలు రోజుకు 15 గంటలు. ఒకటి నుంచి 3 ఏళ్లలోపు 12–15 గంటలు, 3–5 ఏళ్లవారు 11–15 గంటలు, 5–12 ఏళ్లవారు 9–11 గంటలు, 13–17 ఏళ్లవారు 8–10 గంటలు, 18–25 ఏళ్లవారు 7–9 గంటలు, 26–64 ఏళ్ల వరకు 7–9 గంటల పాటు నిద్రపోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల వివరాలు

నియోజకవర్గం	బరిలో
కరీంనగర్:	27
హుజూరాబాద్:	22
చొప్పదండి:	14
మానకొండూరు:	10
సిరిసిల్ల:	21
వేములవాడ:	16
పెద్దపల్లి	17
మంథని	21
రామగుండం	23
జగిత్యాల	15
కోరుట్ల	15
ధర్మపురి	15
మొత్తం	216

లేకపోతే ఏమవుతుంది?

ప్రస్తుతం పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల నాయకులందరూ రోజుకు 4 గంటలకు మించి నిద్రపోవడం లేదు. అర్ధరాత్రి వరకు మెలకువతో ఉండటం, తెల్లవారుజామున లేవడం వల్ల వారికి నిద్ర సరిపోవడం లేదు. ఫలితంగా బరువు పెరగటం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, బీపీ, గుండెజబ్బులు, మతిమరుపు వంటి సమస్యలు వచ్చి, చివరకు తీవ్ర అనారోగ్యానికి దారితీసే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సమయానికి భోజనం చేయకపోవడంతో షుగర్ బారిన పడుతున్నారని అంటున్నారు. కొందరు డీజేలతో ప్రచారం చేస్తున్నారు. దాని పక్కన డాన్సులు చేసే నాయకులు, కార్యకర్తలకు గుండెపోటు ముప్పు పొంచి ఉందని పేర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో కిందపడి, గాయాల పాలవుతున్నారు.

నిద్రలేమితో అనేక సమస్యలు



ప్రతీ మనిషికి 6 నుంచి 8 గంటల నిద్ర అవసరం. నిద్రలేమి అనేక సమస్యలకు కారణమవుతుంది. ముఖ్యంగా ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి తగ్గడం, తలనొప్పి, నీరసం వంటివి వస్తాయి. ఎక్కువ రోజులు నిద్రలేమి ఉంటే బీపీ, షుగర్, గుండె జబ్బుల బారిన పడతారు. బరువు పెరగడం, బ్యాలెన్స్ తప్పడం, ఇమ్యూనిటీ కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ సాయిని నరేందర్, ఎండీ

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులుండాలి



సర్ధాపూర్ గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- ఓటరు సమాచార స్లిప్‌లు పంపిణీ చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి
- సర్ధాపూర్ ఈవీఎం గోదాం పరిశీలన

సిరిసిల్ల: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని 547 పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని, ఓటరు సమాచార స్లిప్‌లను నిర్దేశిత గడువులోగా పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహసీల్దార్లతో మాట్లాడారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 547 పోలింగ్ కేంద్రాలున్నాయని, అన్ని కేంద్రాల్లోనూ ఈనెల 30న పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా చూడాలని తహసీల్దార్లను ఆదేశించారు. రోజువారీ షెడ్యూల్ ప్రకారం ఓటరు సమాచార స్లిప్‌లను నిర్దేశిత గడువులోగా పంపిణీ చేపట్టాలన్నారు. ఈనెల 21 నుంచి 25 వరకు 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్దనే ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం హోం ఓటింగ్ సదుపాయాన్ని కల్పించిందని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్దేశిత బృందాలు హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి నిబంధనల మేరకు ఓటు హక్కుకు అవకాశం కల్పించాలని సూచించారు. హోమ్ ఓటింగ్ సమయంలో ఓటింగ్ కంపార్ట్‌మెంట్ సహాయంతో రహస్య ఓటింగ్‌కు భంగం వాటిల్లకుండా ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. స్థానికసంస్థల అదనపు కలెక్టర్ బి.గౌతమ్‌రెడ్డి, ఎస్డీసీ గంగయ్య, పోస్టల్ బ్యాలట్ నోడల్ అధికారి లక్ష్మీరాజం, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొత్త బ్యాలట్ యూనిట్లను భద్రపరచాలి

సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణకు జిల్లాకు 384 అదనపు బ్యాలట్ యూనిట్లు వచ్చాయని, వాటిని భద్రపరచాలని కలెక్టర్ సూచించారు. శనివారం ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సర్ధాపూర్ వ్యవసాయ గోదాంలో అధికారులు అన్ని బ్యాలట్ యూనిట్లను స్కానింగ్ చేసి భద్రపరిచారు. కొత్తగా వచ్చిన బ్యాలట్ యూనిట్లకు ఈనెల 20, 21వ తేదీన ఫస్ట్ లెవల్ చెకప్ చేసి, ర్యాండమైజేషన్, మాక్‌టెస్టింగ్ పూర్తి చేసి కేటాయించనున్నారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, డిప్యూటీ తహసీల్దార్ రెహమాన్, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రహీం ఉన్నారు.

వృద్ధులు, దివ్యాంగుల దరికే పోలింగ్ కేంద్రాలు

- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం



వయోవృద్ధులతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల: జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో వయోవృద్ధుల కేంద్రంలో శనివారం వృద్ధులతో మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే రహస్యంగా ఓటువేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పిస్తుందని తెలిపారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు ఫామ్–12డీలో దరఖాస్తులు చేసుకున్న దివ్యాంగులకు, వయోవృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ముందస్తు సమాచారాన్ని దరఖాస్తు చేసుకున్న వారికి బూత్ లెవల్ అధికారులు ఇస్తారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వీల్‌చైర్స్, ర్యాంపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అధికారులు సుచరిత, సఖీ నిర్వాహకులు రోజా, ఓల్డ్ ఏజ్ హోమ్ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

22న హుండీ లెక్కింపు

వేములవాడ: భక్తుల ద్వారా రాజన్నకు హుండీలలో వచ్చిన ఆదాయాన్ని ఈనెల 22న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఎట్టకేలకు యారన్ సబ్సిడీ

- కార్మికుల ఖాతాల్లో రూ.8.77 కోట్లు జమ
- 5,128 మంది నేతన్నల బ్యాంకు ఖాతాల్లో జమ
- 2021 యారన్ సబ్సిడీ విడుదల
- ఇంకా పెండింగ్‌లో 2022, 2023 యారన్ సబ్సిడీ



సాంచాల ముందు నిల్చున్న ఇతను దూస లక్ష్మీనారాయణ(57). సిరిసిల్ల పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన ఇతను 2021లో బతుకమ్మ చీరల బట్టను 28వేల మీటర్లు నేశాడు. అప్పుడు నేసిన బట్టకు సంబంధించి శుక్రవారం రూ.40వేలు లక్ష్మీనారాయణ బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. సిరిసిల్ల నేత కార్మికులకు కూలి సర్దుబాటులో భాగంగా ప్రభుత్వం 10 శాతం యారన్ సబ్సిడీని ఇస్తుంది.



ఇతను గణేశ్‌నగర్‌కు చెందిన పవర్ లూమ్ కార్మికుడు భైరి రాజమౌళి(48). సిరిసిల్లలో సాంచాలు నడుపుతూ బతుకమ్మచీరల బట్టను 2021లో ఉత్పత్తి చేశాడు. 15వేల మీటర్ల బతుకమ్మ చీరల బట్టను నేయడంతో రాజమౌళికి ఇప్పుడు రూ.20వేలు బ్యాంకు ఖాతాలో టెస్కో అధికారులు జమ చేశారు. ఇలా ఒక్కరు.. ఇద్దరు కాదు.. సిరిసిల్ల పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన నేతకార్మికులు 5,128 మందికి రూ.8.77కోట్లను టెస్కో అధికారులు జమ చేశారు.



వస్త్రోత్పత్తి చేసే కార్మికుల వివరాలు నమోదు చేస్తున్న సీఎఫ్ వేముల మార్కండేయులు

కార్మికుల ఖాతాల్లో జమయ్యాయి



బతుకమ్మ చీరలకు సంబంధించి 2021 నాటి 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు నేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. సిరిసిల్లలోని 5,128 మంది కార్మికుల ఖాతాల్లో రూ.8.77 కోట్లు చేరాయి. 2021 నాటి యారన్ సబ్సిడీ సొమ్ములు పెండింగ్‌లో లేవు. 2022 నాటి యారన్ సబ్సిడీ డబ్బులు కార్మికులకు రావాల్సి ఉంది.

– మిట్టకోల సాగర్, జౌళిశాఖ సహాయ సంచాలకులు, సిరిసిల్ల

సిరిసిల్ల: దసరా, దీపావళి పండగలన్నీ వెళ్లిపోయాయి. పండుగలకు యారన్ సబ్సిడీ డబ్బులు వస్తాయని ఆశతో ఎదురుచూసిన నేతన్నలకు నిరాశలే దిక్కయ్యాయి. ఎట్టకేలకు పండుగలు అన్ని పోయాక టెస్కో అధికారులు కార్మికుల ఖాతాల్లో పది శాతం యారన్ సబ్సిడీ డబ్బులను జమచేశారు. కార్మికులు ఉత్పత్తి చేసిన బట్ట ఆధారంగా.. ఆ బట్టకు వినియోగించిన యారన్(నూలు) లెక్కించి అందులో పది శాతం డబ్బులను కూలిగా కార్మికులకు చెల్లిస్తున్నారు. 2021 నాటి బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ ఆలస్యంగా జమయింది. వాస్తవానికి క్షేత్రస్థాయిలో కార్మికులు ఉత్పత్తి చేసిన బట్టను మీటర్లలో కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు(సీఎఫ్) లెక్కించి రికార్డుల్లో నమోదుచేసి ఆధార్‌కార్డు, సాంచాల జియో ట్యాగింగ్ నంబర్, బ్యాంకుఖాతా నంబర్, కార్మికుల ఫోన్ నంబర్లను నమోదు చేసి నివేదిక సమర్పిస్తే 10 శాతం యారన్ సబ్సిడీ ఆలస్యంగా విడుదల అవుతుంది.

ఇంకా పెండింగ్‌లో యారన్ సబ్సిడీ సొమ్ము

సిరిసిల్లతోపాటు చంద్రంపేట, తంగళ్లపల్లి, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లోనూ కార్మికులు సాంచాలు నడుపుతారు. నిజానికి క్షేత్రస్థాయిలో శ్రమించే కార్మికులు నిజమైన పేదలు. వీరికి కూలిని సర్దుబాటు చేయాలని, మెరుగైన వేతనం అందించాలని యారన్ సబ్సిడీని 2018 నుంచి ప్రభుత్వం అమలు చేస్తుంది. 2022 నాటి బతుకమ్మ చీరలకు సంబంధించిన యారన్ సబ్సిడీ, 2023 ఈ ఏడాది ఉత్పత్తి చేసిన బట్టకు యారన్ సబ్సిడీ ఇంకా రావాల్సి ఉంది. యారన్ సబ్సిడీ విడుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక పర్యాయాలు జౌళిశాఖ ఆఫీస్ ముందు కార్మికులు ఆందోళన చేశారు. ఎట్టకేలకు 2021 నాటి యారన్ సబ్సిడీ రావడంతో నేత కార్మికులకు కాస్త ఆర్థిక చేకూర్పు లభించింది.

నిబంధనలు పాటించాలి

- ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అభ్యర్థులు ఎన్నికల నియమ, నిబంధనలు పాటిస్తూ ప్రచారం చేసుకోవాని ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం బీఎస్పీ అభ్యర్థి పిట్టల భూమేశ్‌తో సమావేశమయ్యారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారం చేసుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బులు, మద్యం పంపిణీ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో వేడి వాతావరణం నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం రాచర్లగొల్లపల్లిలో వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న 11 మందికి జరిమానాలు విధించారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆధ్యాత్మిక పట్టణం.. సమస్యల నిలయం

- వేములవాడలో అన్నీ సమస్యలే..
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- కంపుకొడుతున్న కాలనీలు
- ప్రధాన రోడ్లపై ట్రాఫిక్‌జామ్

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ పట్టణంలో ఎటూ చూసిన సమస్యలే కనిపిస్తున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాజన్న ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. వచ్చిన భక్తులకు వసతులు, పట్టణంలో రహదారులు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకురోడ్లు, ఉన్న రోడ్లు గతుకులతో అధ్వానంగా మారడం, ఆలయ ఆవరణలో ఎక్కడ చూసినా వాహనాల పార్కింగ్‌తో అవస్థలు పడుతున్నారు. వేములవాడలో డ్రెయినేజీలు సక్రమంగా లేక మురికి కంపు కొడుతోంది.

మురికి కంపు

- వేములవాడలోపలు వార్డుల్లో డ్రెయినేజీ సరి గ్గా లేక ఇళ్ల మధ్యలో మురికినీరు నిలుస్తుంది.
- దోమలతో ఇబ్బందిగా మారిందని ఫాగింగ్ చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.
- వేములవాడ అర్బన్ కాలనీ, సాయిబాబా ఆలయం, చెక్కపల్లి బస్టాండ్ ప్రాంతాల్లోని మురికినీరు కట్టుకాలువ ద్వారా రాజన్న గుడి చేరువులోకి చేరుతుంది.

కనిపించని సీసీరోడ్లు

- వేములవాడ పట్టణంలోని పలు వార్డుల్లో సీసీరోడ్లు లేవు. వాహనాలు వెళ్తుంటే వెనుక దుమ్ము లేచి గృహాల్లోకి వస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
- వర్షాకాలం మట్టి బురదతో వాహనాల మీద బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందంటున్నారు.

ఇరుకురోడ్లతో ట్రాఫిక్‌జామ్

- వేములవాడ బస్టాండ్ తిప్పాపూర్‌లో మూడు చౌరస్తాల వద్ద ట్రాఫిక్‌జామ్ అవుతోంది.
- వేములవాడ మూలవాగుపై రెండు వంతెనల పనులను ఏళ్ల క్రితం ప్రారంభించినప్పటికీ ఒక్కటే పూర్తయింది. మరొకటి మధ్యలోనే ఆగిపోయింది.



వేములవాడలో ఇళ్ల మధ్య మురుగు నీరు

- రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుండడంతోపాటు ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల సంఖ్య కూడా ఎక్కువగా ఉండగా పట్టణంలో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది.
- మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు రోడ్లు ఇరుకుగా ఉండడం, రాజన్న గుడి నుంచి బద్దిపోచమ్మ వరకూ గల ఇరుకురోడ్లతో భక్తులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్

- వేములవాడ రాజన్న అలయం చుట్టూ ఎక్కడ చూసినా ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతున్నారు.
- రాజన్న ఆలయం ముందు ప్రాంతంలో మెట్ల వద్ద వాహనాలు నిలుపుతున్నారు.
- అసలే ఇరుకురోడ్లు అందులో ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్‌తో భక్తులకు ఇబ్బందిగా మారింది.
- రాజన్న ఆలయ చెరువు కట్టపైన పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ అక్కడ వాహనాలు నిలపడం లేదు.

నిరుపయోగంగా మార్కెట్ భవనం

- వేములవాడలోని భగవంతరావునగర్‌లో రూ.2.70 కోట్లతో మున్సిపల్ ఆధ్వర్యంలో అధునాతన వసతులతో కూడిన మార్కెట్ భవ నం నిర్మించారు. కూరగాయల వ్యాపారులకు అనుకులంగా స్టాల్స్ ఏర్పాట్లు చేసినా వినియోగించడం లేదు.
- ప్రస్తుతం కూరగాయాల మార్కెట్ రోడ్లపైనే కొ నసాగుతుంది.



గుడిచెరువులోకి వెళ్తున్న మురికినీరు

వేములవాడ మూలవాగు రెండో బైపాస్‌రోడ్డు పక్కన కూరగాయల మార్కెట్ నడుస్తుంది. ప్రభుత్వ కళాశాల ముందు రోడ్డుపై కూడా కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేశారు.

డ్రెయినేజీలు లేవు



వేములవాడలో డ్రెయినేజీలు సక్రమంగా లేవు. ఇళ్ల మధ్యలో మురికి నీరు ఆగి కంపు కొడుతున్నాయి. సీసీ రోడ్లు లేక రోడ్ల మీద దుమ్ము ఇళ్లలోకి వస్తుంది. వర్షాకాలంలో బురదతో ఇబ్బంది పడుతున్నాం.

– లక్ష్మి, వేములవాడ

ఎక్కడపడితే అక్కడే పార్కింగ్



రాజన్న ఆలయ ప్రాంతంలో బైక్‌లను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందిగా మారుతుంది. గుడి చెరువులో పార్కింగ్ ఉన్నప్పటికీ అక్కడికి ఎవరూ వెళ్లడం లేదు.

– సురేశ్, వేములవాడ

ఇరుకు రోడ్లతో ట్రాఫిక్‌జామ్



వేములవాడలో ఇరుకురోడ్లతో ట్రాఫిక్‌జామ్ అవుతుంది. మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న గుడి వరకు ఇరుకు రోడ్లు, గుడి ముందు నుంచి బద్దిపోచమ్మ వరకు తరచూ ట్రాఫిక్‌తో వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

– చందు, వేములవాడ

పిల్లల కోసం తొలిమెట్టు



విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్

వేములవాడఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం తొలిమెట్టు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్కూల్ ఎడ్యుకేషన్, కళాశాల విద్యాశాఖ సంయుక్తంగా కమ్యూనిటీ ఇంప్రువెంట్ ప్రోగ్రాంలో భాగంగా వలంటీర్లతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం ప్రారంభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, కళాశాలకు చెందిన సుమారు 75 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో జిల్లాలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. వలంటీర్లు ప్రతినెలా శనివారం వారికి కేటాయించిన పాఠశాలల్లో తమ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల ఐక్యత చాటాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): అసెంబ్లీ ఎన్నికల్లో పద్మశాలీలు ఐక్యతను చాటాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య కోరారు. ముస్తాబాద్‌లోని మార్కండేయ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పద్మశాలీలు, నేత కార్మికుల సమస్యలు పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఐక్యతతో ఉంటూ నేత కార్మికుల బాగు కోసం పనిచేసే నాయకుడినే గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు గూడూరి భరత్, కొండ ప్రతాప్, దిడ్డి రాజు, తడుక బాలకిషన్, గౌడ మల్లేశం, బిట్ల దేవానందం, సహదేవ్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం కూనవేనిపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సుధాకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వానరాసి శ్రీనివాస్ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నాడనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. వంద చిన్న సంచుల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్‌చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ప్రజలు వెంటనే 87126 56372 నంబర్, డయల్ 100కు తెలపాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, తిరుపతి, శ్రీను ఉన్నారు.

బతుకమ్మ చీరల సబ్సిడీ విడుదలపై హర్షం



కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం సిరిసిల్లలో బతుకమ్మ చీరలు నేసే కార్మికులకు పదిశాతం యారన్ సబ్సిడీ డబ్బులు విడుదల చేయడంపై శనివారం పట్టణంలో హర్షం వ్యక్తమైంది. బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ 5,128 మంది కార్మికుల ఖాతాల్లో రూ.8.77కోట్లు జమైనట్లు తెలిపారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్, అడ్డగట్ల మురళి, వెంగల వెంకటేశం, మల్లేశం, శ్రీకాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవాన్ని విజయవంతం చేయాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లోని ప్రసిద్ధ శివకేశవుల ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా లక్ష దీపోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ ఎల్సాని దేవయ్య, అర్చకుడు హరీశ్‌శర్మ తెలిపారు. అదే రోజు సాయంత్రం ఆలయంలో మహా లింగార్చన, దశ సహస్ర దీపారాధన ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని లక్ష దీపోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జోనల్‌స్థాయి షటిల్ పోటీలకు ఎంపిక



మణికంఠను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ అండర్–17 జోనల్ స్థాయి పోటీలకు మండలంలోని విలాసాగర్ హైస్కూల్ విద్యార్థి గోనెపల్లి మణికంఠ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బొలగం శ్రీనివాస్, పీఈటీ తోకల మధుకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 17న సిరిసిల్లలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఈసందర్భంగా మణికంఠను పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి, శోభారాణి, వెంకటహనుమాన్, సురేందర్‌రెడ్డి, మధుసూదన్, జ్యోష్నారాణి, ప్రకాశ్, రాధిక, మోహనకృష్ణ, వసుంధర, శమంతకమణి, జూనియర్ అసిస్టెంట్ షఫియొద్దీన్ ఉన్నారు.